# జగత్ సత్యం బ్రహ్మ మిథ్య

బోయి భీమన్న

భీమన్న సాహితీ నిధి ప్రచురణ

**Jagath Satyam - Brahma Midhya**

-Dr. Boyi Bhimanna

All rights reserved

First Edition: January, 2004

Price: Rs. 60/-

Cover Page Designed
**Rama Krishna Pilla**

Printed by:
**Intensive Designs Media**
Kukatpally, Hyderabad -72
Ph: 040-23161289, Mobile: 9849638108
E-mail: rcrakhil@yahoo.com

Published by:
**Bhimanna Sahithi Nidhi**
Irrum Manjil Colony
Hyderabad.
E-mail: b_bhimanna@yahoo.com
URL: www.boyibhimanna.com

# అంకితం

ఈ కావ్య రచనకు కారణమైన

ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారికి

ప్రేమతో ఈ కావ్యాన్ని అంకితమిస్తున్నాను.

భీమన్న

# జగత్ సత్యం - బ్రహ్మ మిథ్య

(సౌందర్యానికి కేంద్రంగా, సర్వ శిల్ప మనోజ్ఞంగా అదేదో ఒక లోకం వెన్నెల రాత్రి. క్రీడోద్యానం. కలువ కొలను, అక్కడనే నున్నా ననిపించే మధుర స్థితి. జో కొడుతున్నది గంధర్వగానం)

## గానం

తల్లీ ! విద్యా వల్లీ !
పల్లవించవే మళ్ళీ మళ్ళీ
నవ రుచివై ఉన్నవ రుచివై
నవ్వై క్రొన్నవ్వై విరియవే !

ప్రతిభవు నీవే, ప్రజ్ఞవు నీవే
ప్రగతికి రూపము, దీపము నీవే !
గతము గరళమై కాల్చుచున్నది
నతము నవతకు శృతి చేయగదే !

## నేను

గానం వినిపిస్తూ ఉంది
గాయని కనిపించడం లేదు
అనంత కాలంగా వింటున్న ట్టున్నాను
నేను ఈ అమృత మధుర గానం !
గాయని ఎవరో నా మనసే లాగుంది !

పారవశ్యం లోకి పోయి
మళ్లీ మెలకువ లోకి వస్తున్నాను !
ఏదో అర్థ మవుతున్నట్లుంది.
అవును, ఈ గేయం నాదే,
నేను వ్రాసిందే !
అవును, అవును !

ఎప్పుడో వ్రాసి పాడుకొని
ఎక్కడో మరచి పోయా నన్న మాట
కావచ్చు, కావచ్చు !

(అప్పుడు వినిపించిందొక పురుష కంఠం. మంద్రంలో మధురంగా ఉన్నా, భావంలో నిష్ఠూరం ఉంది.)

## కంఠం

ఒరేయ్, బోయ కవి రాయా,
భీమన్న నామ ధేయా!
ఏమిటిరా సెలవిచ్చావ్ నిన్నటి సభలో ?
జగత్ సత్యం బ్రహ్మ మిథ్య అన్నావు కదూ?

## నేను

బ్రహ్మ అంటే మీరు కాదయ్యా బాబూ !
బ్రహ్మ అంటే పరబ్రహ్మ !
అది మీరే అనుకొంటే నాకు
అభ్యంతరం లేదు లెండి.
మీ సృష్టి మిథ్య గానే ఉంది కదా !
మీ పని మిథ్య అయితే
మీరూ మిథ్యే మరి !

## బ్రహ్మ

పర బ్రహ్మ మిథ్య ఎలా అవుతుందిరా,
మూర్ఖుడా ?
బయలులో బ్రతుకుతూ
బయలే లేదంటావురా ?
మిథ్య అంటే నేనే కావాలి.
పరబ్రహ్మ మిథ్య కావడానికి వీల్లేదు.
చతుర్ముఖ బ్రహ్మను
నన్నే మిథ్య అంటావా ?

## నేను

బ్రహ్మ పేరు మీకూ ఉండడం వల్ల
వచ్చిన చిక్కది !
ఇంతకూ -
నిన్న ఏ సభా జరగ లేదు కదయ్యా !

## కంఠం

నిన్న సాయంత్రమే కదరా
త్యాగరాయ గాన సభ హాలులో
రసమయి రాము పర్యవేక్షణలో
జీవీయస్ షష్టిపూర్తి జరిగింది !
అది గొప్ప సాహితీ మహోత్సవంగా జరిగింది ?

నేను

అది జరిగింది నిన్న సాయంత్రం కాదయ్యా,
నేటి సాయంత్రమే !

కంఠం

ఇప్పుడు టైమెంతరా,
రాత్రి పన్నెండు దాటలేదా ?

నేను

ఓహో, అదా !
అది మన సంప్రదాయం కాదు కదయ్యా!
మన లెక్కలో ఉదయం ఆరు నుంచి
మళ్లీ ఉదయం ఆరు వరకూ ఒక రోజు !
మీరు బ్రహ్మ అయితే –

(అప్పుడు నవ్వింది సమీపంలోనే ఉన్న వీణ ! వీణ తీగలు స్పందిస్తూనే ఉన్నయ్. గానం కొనసాగుతూనే ఉంది.)

## కంఠం

అయితే, నేను అప్రాచ్యు ణ్ణింటావ్ ?
నాకు నాలుగు ముఖా లున్నయ్ కదా !
నాలుగూ నాలుగు దిక్కులు !
ఒకటి ప్రాచ్యం
రెండోది అప్రాచ్యం
మూడోది ఉత్తరం
నాలుగోది దక్షిణం

ఇప్పుడు నడుస్తున్న జమానా అంతా
అప్రాచ్యమే కదరా !
నీ క్రాపింగ్ ప్రాచ్యమా ?
నీ షర్టు జేబు ప్రాచ్యమా ?

## నేను

షర్టు కూడా ప్రాచ్యం కాదు లెండి
వీణను చూచి నప్పుడే అనుకొన్నాను
మీరు బ్రహ్మ దేవుడే అయి ఉంటారని !
మీరు నిజంగా చతుర్ముఖ బ్రహ్మా !

(అప్పుడు ఒక్కొక్క ముఖమే వెలుగులోనికి రాసాగినై. నాలుగు ముఖాలూ స్పష్టంగా కనిపిస్తున్నయ్. బ్రహ్మ ప్రత్యక్షంగా కనిపిస్తున్నాడు. ఆ ప్రక్క సరస్వతి. ఎదురుగా నేను. చిన్న బొమ్మలా ఉన్నాను. బ్రహ్మ నా కెదురుగా ఉన్న ముఖం తోనే మాట్లాడుతున్నాడు)

బ్రహ్మ

ఇక ముసుగులో గుద్దులా టెందుకు కాని
నిన్నిక్కడికి తెచ్చిందెందుకో గుర్తించావా?

నేను

మీ పలకరింపు లోని వక్రతను
మీ సంభాషణలోని విరసతను
సూచనగా తీసుకొని అనుకొన్నాను
ఏదో సంజాయిషీ కొరకే ఇక్కడికి తెచ్చారని.

బ్రహ్మ

వాగ్దేవి బలవంతం మీద నేను
నిన్నటి ఆ సభకు వచ్చాను
చివరి వరకూ ఉండడం
వి ఐపీ లక్షణం కాదని
మధ్యలోనే లేచి పోదామనుకొంటే
పట్టుకుని కూర్చోపెట్టిం దీవిడ
చివరి వరకూ చూచి పోదామని !

### సరస్వతి

మంచి పనే చేశాను కదండీ !

లేకపోతే –

అంతమంది కవి పండితుల్నీ

అంతమంది మేధావుల్నీ

అంతటి సారస్వత వైభవాన్నీ

ప్రత్యక్షంగా చూచే అదృష్టం కలిగేదేనా?

### బ్రహ్మ

అంతటి అవమానాన్ని, అవహేళనను

భరించ వలసిన దురదృష్టం కూడా

కలిగేది కాదు !

### సరస్వతి

ఆ దిక్కుమాలిన విఐపి మనస్తత్వాన్ని

అలవర్చుకోవద్దని

ఎన్ని సార్లు చెప్పాను మీకు ?

అక్కడ చేరిన గొప్ప వాళ్లంతా
అధికార పదవీ ధన మద మత్తులు !
మేధావుల సభల్లోకి ధైర్యంగా వెళ్ళలేరు
సెక్యూరిటీ లేకుండా ప్రజ ల్లోకి వెళ్లలేరు
బధిరాంధక విగ్రహాలై దాగుకొనే కంటే
ప్రజ్ఞానుల సూక్తుల్ని స్వయంగా విని
లోపాలను దిద్దుకోవడం లోకజ్ఞత కాదా!

## బ్రహ్మ

ఓహో,
ఇదంతా నీ వ్యూహ మన్న మాట !
నేను నీ మాట వినడం లేదని
నీ భక్తుడి చేత
అందరి తోనూ తిట్టించావు.
చతుర్ముఖుడి సృష్టి
దుష్టమై పోయిందని చెప్పించావు
నేను సృష్టించడం మానేస్తే
బహుముఖ ప్రజ్ఞాన సృష్టి

నీవు చేస్తావా ?
భర్తను కించ పరచడం
పతివ్రతల లక్షణం కాదు
పాతివ్రత్యం వినా పడతికి
మరొక శక్తి లేదన్న సంగతి మరచిపోకు !

## సరస్వతి

మరచి పోయింది మీరు !
నా శక్తి పాతివ్రత్యంతో వచ్చింది కాదు
పాతివ్రత్యం పతికి కట్టు బానిసతనం !
బానిసతనం శక్తి నివ్వదు.
నా శక్తి తపసుతో వచ్చినట్టిది
లక్ష్మి, పార్వతి కూడా
స్వయం శక్తిమంతులే !
చైతన్యం వికసించిన కొలదీ
వెలుగు ప్రసరిస్తున్న కొలదీ
అమాయకత్వం తొలగి పోతున్నది
స్త్రీ తన శక్తిని తను గుర్తిస్తున్నది.

మీ సృష్టికి ప్రాణం పోస్తున్నది నేనే కదా !

ఆ వాస్తవం ఇప్పటి దాకా తెలియదు

ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది

ఎ్వరూ చంపలేని మహిషాసురుడ్ని

చంపిం దెవరు ?

అది ఆమె తపశ్శక్తి,

విజృంభించిన స్త్రీ స్వశక్తి !

బ్రహ్మ

అట్టి వాళ్లను కూడా సృష్టించింది నేనే

ప్రాణాన్ని కూడా సృష్టించింది నేను !

సరస్వతి

కమల నాభుని నాభి కమలాన్ని కూడానా ?

కమల నాభుని కూడా నా ?

బ్రహ్మ

అవును, నేను !

నేనే సృష్టించాను.

సృష్టి అంటే సృష్టే, అదేదైనా కానీ !

నేను సృష్టి కర్తను !

## సరస్వతి

మరి మిమ్ము సృష్టించిం దెవరు ?
మీకు ముం దేముంది?

## బ్రహ్మ

నేను, నన్ను నేనే సృష్టించు కొన్నాను
నాకు ముందు కూడా నేనే ఉన్నాను
నేను స్వయం భువును !

## సరస్వతి

లోకం మిమ్ము కమల గర్భు డంటుందే !
విష్ణువు నాభి కమలం నుంచి -

## బ్రహ్మ

(నన్ను చూపుతూ - )
ఇదిగో, ఇలాంటి ప్రబుద్ధులు
వ్రాసే వ్రాతలవి !
ఊహలు మట్టి వంటివి
కుమ్మరి మట్టితో కుండలు చేసేటట్టు
కవులు ఊహలతో చరిత్రలు సృష్టిస్తారు.

చరిత్ర అంతా అదే !
కళ లన్నీ అవే !
కథలు వట్టి వ్యథలు !
(సరస్వతి ఏదో చెప్పబోతుండగా నేను ఆపి)

## నేను

తల్లీ ! తండ్రీ !
మీ వివాదం నాకు బోరు కొడుతున్నది
అందులో నాకు ఆసక్తి లేదు
నా సంగ తేమిటో తేల్చండి
నాకు అవతల అవసరమైన పనులున్నయ్ !

## బ్రహ్మ

ఏమిట్రా ఆ పనులు ?
నా సృష్టిలో తప్పులు వెతుకుతూ
కూర్చోడమేనా ?

## నేను

కావచ్చు !
మీరైతే –
ఎప్పుడో ఒకసారి సృష్టి చేసేసి
దాన్ని స్టీరియోకి ఎక్కించేశారు
ఇక కుప్ప తెప్పలుగా అవే నకళ్లు
యుగాలు మారినా అవే నకళ్లు
శాల్తీలలో ఏ మార్పూ లేదు
గుణాలలో ఏ మార్పూ లేదు
ఆనాడూ ఒక్క ఇంద్రుడు, ఒక్క అహల్య
ఈనాడు లక్షల ఇంద్రులు,
కోట్ల అహల్యలు !
అహల్యలు చస్తున్నారు,
ఇంద్రులు పదోన్నతి పొందుతున్నారు.
అవే స్టీరియో నకళ్లు !
మీరు కొత్తగా చేస్తున్న పనేమిటి ?

## సరస్వతి

అదే నేను అడుగుతున్న ప్రశ్న !
ఎంతో కాలంగా అడుగుతున్నాను
చెప్పండి, నాథా ! జవాబు చెప్పండి
మీ సృష్టంతా ఒక పెద్ద గొంగళి.
అందులో ఉండేవన్నీ వెంట్రుకలే !
కాదంటారా, చెప్పండి !

(అప్పుడు జరిగిందొక చిత్రం. పెద్ద ధ్వనితో నా చుట్టూ ఉన్న బయలు లోని ఒక పొర బ్రద్దలయింది. అసలు బయలే శూన్యం. శూన్యంలో పొరలు, ఒక్కొక్క లోకం. ఒక్కొక్క బ్రహ్మాండం నా చుట్టూ అనేక బ్రహ్మాండాలు. మేం కేంద్రంలో ఉన్నాం. మా చుట్టూ ఉన్న లోకాల నుంచి అనేక కాలాల ప్రతినిధులు బిలబిల మంటూ వచ్చి మా ముగ్గుర్నీ చుట్టుముట్టారు. మానవ రూపాల్లో ఆత్మలు, చిన్న చిన్న వెలుగు నీడల్లా ఉన్నారు. అందులో నాకు తెలిసిన ముఖాలు కూడా ఉన్నట్టున్నాయ్.)

### ఆత్మలు

(ఏక కంఠంతో)

మేం వెంట్రుకలం కాం

మేం వెంట్రుకలం కాం

### బ్రహ్మ

ఆ మాటలు నే నన్నవి కాదు

### నేను

మరె వరన్నారు ?

ఆ ఆత్మ లన్నీ మీరే కదా!

కాదంటారా ?

బ్రహ్మ

అంటానురా, అంటాను !
ఆ ఆత్మలు నా సృష్టి కావచ్చు
నేను మాత్రం కాదు
నా సృష్టిని వెంట్రుక లంటే ఒప్పుకోను !

(సరస్వతి ఏదో అనబోతే నేను చేతులు మోడ్చి ఆపాను. ఆత్మలలో కొన్ని ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయ్. స్పష్టమైన రూపాలలో ! అందులో శివుడు, కుమార స్వామి, విష్ణువు, వాల్మీకి, రాముడు, అశరీర వాణి, కర్ణుడు, ధర్మ రాజు, గాంధీ, బమ్మెర పోతన వగైరా. ఈ అందరూ నా విమర్శకు గురైన వాళ్ళే !

ఆత్మలు

మేం వెంట్రుకలం కాం
మేం వెంట్రుకలం కాం

బ్రహ్మ

వినరా ఆ ఆత్మల ఘోష !
వాటిని వెంట్రుక లంటే నే నొప్పుకోనురా
ఒరే, నీవు కవే కావచ్చు కాని
అంతకు మించిన అహం కారివి
నీవు పుట్టిన క్రింద నుంచి పైకి చూచో

నీవు ఊహించి పై నుంచి
క్రిందకి చూచో
అపహసించే రజో గుణివి
విమర్శించే మూర్ఖుడివి !

## సరస్వతి

మీ గుణమే వచ్చి ఉంటుంది
తప్పును తప్పనకూడదా .
పుట్టి పెరిగి చచ్చి పోతున్న మీ సృష్టికి
ప్రయోజన మేమిటో చెపుతారా ?

## బ్రహ్మ

నేను గొప్ప గొప్ప చక్రవర్తుల్ని సృష్టించాను
మహా వీరుల్నీ, ఋషుల్నీ సృష్టించాను
నవ బ్రహ్మల్నీ, ఏకాదశ రుద్రుల్నీ
సకల కళల్నీ, సౌందర్యాల్నీ సృష్టించాను

## నేను

ఎందుకు ?
ఎందుకూ అని !

## గాంధీ

బ్రహ్మ దేవా ! మహాను భావా!
ఇతగాడి ఆగడాలు మితి మీరుతున్నవి
జాతి పితా, ఇప్పుడు నీవే జాతికి పితవు
అంటూ నన్నే వెక్కిరిస్తున్నాడు.

కుమార స్వామి
మా అన్నగారి ఊరేగింపుపై రాళ్లు
నేను వేయిస్తున్నవే అంటూ
దుష్ప్రచారం చేస్తున్నాడు.

## పోతన

నేను సొంతంగా వ్రాసిన పద్యాలన్నీ
అనౌచిత్య దూషితాలే అంటున్నాడు

## వాల్మీకి

నేను నిషాదుణ్ణి తిట్టడం
అమానుష మట, అన్యాయ మట
వన నరుల్నీ వానరు లన్నా నట
వాళ్లకు తోక లుంచడం మరీ ఘోర మట !

( ఎంతో మంది ముక్కంటితో సహా ఆరోపణలతో ముందుకు రాసాగారు. అందులో అనేకులు జంతువుల్నీ. పక్షుల్నీ ఎక్కి తిరుగుతున్నవాళ్లు)

బ్రహ్మ

(వాళ్లందర్నీ చెయ్యెత్తి వారించి)

మిమ్మల్నే కాదయ్యా
నన్నూ వెక్కిరించాడీ ప్రబుద్ధుడు !
నేను బొమ్మల్ని చేసి
వాటి నుదుటి మీద
నా మార్కు అక్షరాలు గుద్ది పారేస్తా నట
అమ్మగారు వాటికి ప్రాణం పోసేస్తుం దట
రాగ వాసిష్ఠం నాటకంలో సెలవిచ్చాడు !

పోతన

నుదుటన్ వ్రాసిన వ్రాలు తప్పదు కదా
నూరేళ్లు చింతించినన్
అంటూ మరో కమెవరో వ్రాసారు కూడా !

బ్రహ్మ

అదంత వట్టి అపోహ
నేనేమీ వ్రాయను
ఎవడి కర్మను బట్టి
వాడి జీవితం నడుస్తుంది !

నేను

కర్మ అని
నీవు కూడా అంటున్నావా, తండ్రీ !

బ్రహ్మ

కర్మ అంటే పనిరా !
చేసే పనిని బట్టి
ప్రతిఫలం ఉంటుది.

నేను

ఎవడి జీవితానికి వాడే కర్త అన్నమాట
పనే సృష్టి కర్త అన్నమాట
మరి వేరే బ్రహ్మ దేవు డెందుకు ?

వాల్మీకి

పనినే బ్రహ్మ దేవుడన్నాం
స్వభావస్తు ప్రవర్తతే
అన్నాడు కదా వ్యాసుడు !

బ్రహ్మ

అవునంతే!
సర్వ కర్మలూ మీరే చేసుకుని
విపరీత ఫలితాల కర్మలను
మరొకడి మీదకు తోసేస్తారు
మరొకడే నేను !

నేను

నువ్వే కాదు తండ్రీ, నేను కూడా !
సృష్టి స్వభావాన్నీ, ప్రవర్తననీ
ప్రకృతి పురుష పరంగా చెప్పడం
నా అలవాటు !
పార్వతీ పరమేశ్వరులు
లక్ష్మీ నారాయణులు
సరస్వతీ చతుర్ముఖులు
రాధా కృష్ణులు - అంటూ
జీవితాన్ని ప్రేయసీ ప్రియుల పరంగా
నిరంతర సంయోగంగా చిత్రిస్తాను
అంతర్వాహినిలా ప్రవహించే
నా భావాన్ని గుర్తించక
నన్ను శృంగార కవిగా నిందిస్తూ ఉంటారు.
తింటూ తిట్టుకొనే
అనుభవిస్తూ అసహ్యించుకొనే
అరసికులే అధికం మానవుల్లో.

మానవుల బలహీనతల్ని
మీకూ అంటగట్టి
మిమ్మల్నీ విమర్శిస్తున్నారు
వక్రోక్తులూ, వ్యంగ్యోక్తులూ
కవికి సహజం కదా !
నేను కవినే కదా !

## పోతన

మేమూ మామూలు కవులమే !
మాకూ పొరపాట్లు దొర్లుతై.

## నేను

ఆదర్శ ప్రాయులుగా
ఉండవలసిన పెద్దలలో
ఆ మాత్రం పొరపాట్లు కూడా
భరించలేను నేను
అనౌచిత్యాలను అసలే భరించలేను

(చుట్టూ చూశాను. మా చుట్టూ జనం. పెద్ద ఎన్నికల సభలా ఉంది. అందరూ నా మీద విరుచుకు పడుతున్నట్లే ఉంది.)

# నేను

జగత్పితా ! విశ్వ స్రష్టా ! నాన్నగారూ !
నన్ను విచారించడానికి ఏకంగా
లోక్ అదాలత్‌నే ఏర్పాటు చేశారే !
నన్ను పద్మ వ్యూహంలో పెట్టినంత మాత్రాన
మీ అవినీతి సృష్టి
నీతిమంత మవుతుందా ?
మీ అధికారాన్ని నిలువు కోడానికని
ఇంతమంది స్వాముల్ని
స్కాముల లోకి దించారా?
మీ చాతుర్వర్ణ్య చతుర్ముఖాలు
ఇప్ప డెలా వున్నాయో చూసుకున్నారా?
వాడి పోయి మాడిపోయి
అన్నీ ఒకే రంగుకి మారాయి.

అన్నగారూ, పోతన గారూ !
పలికెడిది భాగవత మట అన్నారే.
భాగవతం మీ సొంతమా ?
భాగవతాన్ని అనువదించడం తప్ప
రామ భద్రుడు మరొక
మౌలిక కావ్యం చెప్పలేదా ?

మహాత్మా గాంధీజీ !
సమోహం సర్వ భూతానాం అంటూ
గోవ్యాఘ్రాలను ఒకే పొలంలో
మేతకు వదిలిన మీరు
నిజంగా ఏ జాతికి పిత ?

అయ్యా వాల్మీకి గారూ ....

(అక్కడ వాల్మీకి లేడు. నా పై ఆరోపణలతో వచ్చిన ఎవరూ లేరు.కుమార స్వామి మాత్రం అధునిక సినిమాలలోలా దూరంగా బ్రేక్ డ్యాన్సు చేస్తున్నాడు. నవ బ్రహ్మలూ, ఏకాదశ రుద్రులూ అంతా అతడి చుట్టూ చేరి కాళ్లు విరుచుకుంటున్నారు. కాసేపు ఆగి కుర స్వామిని పిలిచాను.)

నేను

తమ్ముడూ, కుమార స్వామీ !
కాసేపు ఆ ముగిసిరి ప్రదర్శన ఆపి
నా ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పు !
దేవ సేనాధిపతిగా నీవు
నరకాసురుణ్ణి చంపిన తర్వాత
ఇంత వరకూ ఏం చేస్తున్నావు ?
నిన్ను పూజిస్తున్న జాతి ప్రజలు
అక్కడ అవినీతికి బానిస లవుతుంటే
నీవు ఇక్కడ బ్రేకు డ్యాన్సులు చేస్తున్నావా?
నీ వీర శూర విక్రమ పరాక్రమ –

(అక్కడ కుమార స్వామి లేడు. నాకు బాగా తెలిసిన కొన్ని ముఖాలు తప్ప అక్కడ మరెవరూ లేరు. ఎన్నో ముఖాలు చిరునవ్వులు చిందిస్తూ ప్రశంసాపూర్వకంగా కరచాలనం చేసి పోసాగినై. నాకు బాగా తెలిసిన కొన్ని ముఖాలు కొంచెం ఆగి ముఖం లోకి చూసి తల వూపి నిష్క్రమించసాగినై. అందులో చిన్నప్పటి నుంచీ నాకు స్నేహితులైన వాళ్లు ములపర్తి చెంచయ్య, బళ్ల పురుషోత్తం, బళ్ల జగన్నాథ రావు, శ్రీలక్ష్మి, కందికట్ల నాగభూషణం, కళా వెంకట్రావు, గొట్టిపాటి బ్రహ్మయ్య, అయ్యదేవర కాళేశ్వర రావు, కల్లూరి సుబ్బారావు, వేముల కూర్మయ్య, బి. ఎస్. మూర్తి, తాపీ ధర్మారావు, నార్ల వెంకటేశ్వర రావు, నిడదవోలు వెంకట రావు, దామోదరం సంజీవయ్య, గెద్దాడ బ్రహ్మయ్య మంగళగిరి పరవస్తుదాసు, దివాకర్ల వెంకటావధాని, ఖండవల్లి లక్ష్మీరంజనం, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, గద్దల జోసెఫ్‌కవి, మర్లఫణిశాస్త్రి, కడలి అప్పారావు, కాంద్రేకుల నరసయ్య, కుసుమ సుబ్బారాయుడు, లంకపల్లి బుల్లయ్య, మల్లు అనంతరాములు, పంతగడ బాలకృష్ణ, సూర్య విశ్వనాథ్, కుసుమ ధర్మన్న, ఆలపాటి సూర్య నారాయణ, వీణవంక సుధాకర రెడ్డి, నయనాల గణేశ్వర రావు, చర్ల గణపతి శాస్త్రి, దేలపల్లి రామానుజ రావు, బొజ్జా కృష్ణశాస్త్రి, తెన్నేటి లత, బెజవాడ గోపాలరెడ్డి, కోనాడ సూర్య ప్రకాశ రావు, త్రిపురనేని గోపీచంద్, డా॥ రాఘునందన్ రాజ్, నీతిపూడి గణపతిరావు, బోయ వెంకయ్య, గొల్ల చంద్రయ్య, ఉంద్రు సుబ్బారావు, గొల్లపల్లి సామ్యూలు కవి, చిట్టూరి తులసీ రావు, చిల్లరి గెయోగానంద కవి, కోట పాలయ్య వంటి అనేక మంది అభిమానులు – చివరగా మా అయ్య బోయి పల్లయ్య.)

బ్రహ్మ

ఒరే, నిన్నిక్కడికి తెచ్చింది
అసలు నీ నుంచి సంజాయిషీ
కోరడానికి కాదురా
ఇంకో ముఖ్యమైన విషయం ఉంది
ఇప్పుడెవరూ పట్టించుకోని విషయం !
ఈ సృష్టి పంచ భూతాత్మకం కదా
ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వి
ఈ అయిదు పదార్థాల నుంచి
భౌతిక సృష్టి చేయబడింది
సృష్టిలో పైకి కనిపించే సగం ఇది.
దీనికి అడుగున మరొక సగం
ఉండాలి కదా!
అదేమిటో ఇప్పుడెవరూ
పట్టించుకోవడం లేదు.

ఆకాశం అంటే బయలు కదా
అంటే శూన్యమే కదా
అదెక్కడి నుంచి పుట్టింది ?
పరమాత్మ నుంచి పుట్టింది
పరమాత్మ నుంచి అటు
అయిదు భౌతిక పదార్థాల పుట్టగా
ఇటు అయిదు గుణ పదార్థాలు పుట్టినై.

భావం, మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం
ఈ అయిదూ మనిషిలో వికసించినై
తక్కిన సృష్టిలో నామ మాత్రంగా ఉన్నై.
వీటిని గురించి ఇప్పుడెవరూ
పట్టించుకోవడం లేదు.
వీటి స్వరూపాన్ని తెలుసుకోమని
నిన్ను అడగడానికే ఇక్కడికి తెచ్చాను
సృష్టిని పరిశీలిస్తున్న భావుకులలో
నీవు అగ్రగణ్యుడవు కనుక
ఈ కృషిని ప్రారంభించు.

మనసు యొక్క క్రియా క్షేత్రం ఆకాశం
అలానే తక్కినవి
చతుర్ముఖ బ్రహ్మ నుంచి
ఏక ముఖ బ్రాహ్మికి మార్చడం
అంత సులభం కాదు
దానిని సారస్వత విప్లవం అంటున్నావు కనుక
దానిని సాధించే కృషిని నీవే ప్రారంభించు !
ఇదొక పెద్ద మార్పు,
గొప్ప విప్లవం !
సృష్టిలో మరొక మజిలీ !

నేను

(చేతులు మోడ్చి)

ధన్యోస్మి తండ్రీ, ధన్యోస్మి !
నీ ఆజ్ఞ అమ్మ అనుజ్ఞ
ధన్యోస్మి తండ్రీ, ధన్యోస్మి !

(మా అయ్య వంక చూసి)

అయ్యా, నువ్వెలా వచ్చావు ?
బ్రహ్మరంధ్రం పగుల్చుకుని
మరణించిన వాళ్లు
మోక్షం పొందుతా రంటారు కదా !
మోక్షం పొందిన వాళ్లకు
పునర్జన్మ ఉండదు కదా !
నీవు బ్రహ్మైక్య పొందలేదా ?

(మా అయ్య నన్ను చిరునవ్వుతో కౌగిలించుకొని అదృశ్యమై పోయాడు. అంతకు ముందే అందరూ వెళ్లిపోయారుగా! రంగం అంతా శూన్యంగా ఉంది. నీరవ నిశబ్దంగా ఉంది. బ్రహ్మదేవుడి నాలుగు ముఖాలూ కూడా అదృశ్యమై పోగా, మధ్య నుంచి అయిదవ ముఖం లేచి పకపకా నవ్వుతూ చుట్టూ చూసింది. దృశ్యం అంతా ఒక మహాసభగా మారిపోయింది. స్వాతంత్ర్య పోరాటంలో ఆఖరి దృశ్యంగా వున్నదది. కోటానుకోట్ల ప్రజలతో మహాసభ. వేల జిన్నాలు, లక్షల అంబేడ్కరులు, కోట్ల గాంధీలు సభ నిండా ఉన్నారు. సభ నిండా నా రూపాలే. నేనే వివిధ రూపాలలో ఇన్ని కోట్లమందిగా సభ నిండా ఉన్నానన్నమాట. ఏకైక వక్తగా బ్రహ్మ అయిదవ ముఖం మాట్లాడుతున్నది.)

# బ్రహ్మ అయిదవ ముఖం

భారతీయ ప్రజలారా !
సోదర సోదరీ మణులారా !
నేను బ్రహ్మదేవుడి అయిదవ ముఖాన్ని !
ఆయన పుట్టడమే
అయిదు ముఖాలతో పుట్టాడు
నేను తక్కిన నాలుగు ముఖాలకూ
అధిపతిని !
ఆ స్థితి నుంచి నేనెలా
అదృశ్యమై పోయానో, అదొక పెద్ద కథ.
శివలింగం తుదీ మొదలూ చూడడానికి
బ్రహ్మ, విష్ణువు బయలు దేరినప్పుడు
ఇద్దరికీ దాని అంత దొరకలేదు
కిందికి వెళ్లిన విష్ణువు
తనకు అంతు దొరక లేదని
నిజం చెప్పేశాడు
పైకి వెళ్లిన బ్రహ్మ ఇక వెళ్లలేక
చతికిల బడి కూర్చోగా
పై నుంచి వస్తున్న గోవూ, మొగలి పువ్వూ
ఆయనను పరామర్శించాయి
లింగం పై అంతం చూచి వచ్చినట్టు
బ్రహ్మ అబద్ధమాడగా
అవునని ఆ రెండూ సాక్ష్యం పలికాయి

అప్పటికి నేను
అయిదవ ముఖంగా ఉన్నాను
అబద్ధాన్ని సహించ లేక పోయాను
తక్కిన ముఖాలను నోరు మూయించి
నేను నిజం చెప్పేశాను
విష్ణువుకి లాగే లింగం అంతు
మాకూ దొరకలేదు
అంతు చూశామనడం అబద్ధం అన్నాను
నేనాడిన నిజం చాలా మందికి కిట్టలేదు
అబద్ధాలే ఆహారంగా బ్రతుకుతున్న వాళ్లకు
నిజం నిష్ఠూరమైంది

వాళ్లంతా కలిసి
నాపై దూకి నన్ను నరికి పారేశారు
బ్రహ్మను చతుర్ముఖ బ్రహ్మ అన్నారు
పంచమ ముఖాన్ని గాడిద ముఖం అన్నారు
పంచముఖ బ్రహ్మ ను చతుర్ముఖు డన్నట్లే
పంచ వర్ణ జాతిని చాతుర్వర్ణ్య జాతి అన్నారు
మనువు నాస్తి తు పంచమ అన్నాడు
ద్రోణుడు ఏకలవ్యుడి
అయిదవ వేలును నరికి పారేశాడు.

ఆ విధంగా పంచములకు
అస్తిత్వం లేకుండా చేశారు
గిరిజనులను నిర్వీర్యులను చేశారు
స్త్రీకి స్వాతంత్ర్యం అక్కర లేదని
పాంచాలి వంటి మహా శక్తిని
అవమానాల పాలు చేశారు

(నన్ను చూపుతూ)

ఈ మహా కవి
చూపిన సాహసం వల్ల
హరిజనులూ, గిరిజనులూ,
మహిళలూ కలిసి
మూడు వర్గాలూ ఏకమై
హక్కుల కోసం ముందుకు వచ్చారు
అధికారం చేపడతారు
ఆనందం అందరికీ పంచుతారు
రైతు కూలీ ప్రజారాజ్యం ఏర్పడుతుంది
వర్గాలూ, పోరాటాలూ ఉండవు
ప్రపంచ మానవులంతా
ఏక కుటుంబంగా
జీవించ గలుగుతారు
సత్యం చెప్పుతున్నాను వినండి.
ప్రకృతి సత్యం !

పురుషుడు అంతర్వాహిని
సరస్వతి సత్యం
బ్రహ్మ అంతశ్శక్తి
జగత్తు సత్యం
పరబ్రహ్మ అంతః చేతన
కొబ్బరి చెట్టు కొబ్బరి కాయలే కాస్తుంది
ఎంత ప్రార్థించినా
గులాబి పువ్వులు పూయదు
అంధకారంలో అన్నీ సమానమే
వ్యక్తిత్వం లేని శక్తి
వుండీ లేనట్లే !
అందుకే దానిని
మిథ్య అన్నాడు కవి !
నిజ మంతే !
సత్యం
పరబ్రహ్మ మిథ్యే !

(అప్పుడు దృశ్యంలో క్రమంతా వెలుగు ప్రసరించి సూర్యోదయం మయినట్లయింది. మిథ్యా బ్రహ్మం నుంచి సత్య జగత్తు ఆవిష్కృతమైంది. సర్వత్రా ఒక్కడే బ్రహ్మ, ఏకముఖ బ్రహ్మ, సింహాసనంపై వీణా పాణి సరస్వతి. ఉషస్సులా ప్రకాశిస్తూ ఉంది.)

# జగత్ సత్యం - బ్రహ్మ మిథ్య
## (ప్రవేశిక - సూత్రధారి - నేను)

కవి, పరిశోధకుడు, విమర్శకుడు - ఈ ముగ్గురూ సాహిత్య జగత్తుకి త్రిమూర్తులు.

త్రిమూర్తుల కున్నట్లే ఈ ముగ్గురికీ కూడా అవినాభావ సంబంధం ఉంది. ప్రతిభ, వ్యుత్పత్తి, లోకజ్ఞత ఈ మూడు గుణాలు ఈ ముగ్గురికీ విశేషంగా ఉండవలసి ఉంది. ఈ మూడింటిలో ఏది లోపించినా వారి కృషిలో లోపమే. ఈ ముగ్గురికీ అన్యోన్య సంబంధం ఉన్నప్పటికీ, వారి వారి కృషిక్షేత్రాలు వేరు వేరుగా ఉంట్టై.

పరిశోధకుడు, విమర్శకుడు, సమీక్షకుడు, వ్యాఖ్యాత - ఇవన్నీ సాధారణంగా పర్యాయపదాలు. ఈ అన్నింటికీ కలిపి విమర్శకుడు అనే ఒక్క మాటనే వాడుతున్నానిక్కడ. విమర్శ అంటే ఒక మాదిరి పరామర్శ. పరిశోధన, సమీక్ష, వ్యాఖ్యానం వంటివన్నీ విమర్శలోకి వస్తాయని భావిస్తున్నాను.

కవి వేరు గానూ, విమర్శకుడు వేరు గానూ విడి విడిగా ఉండాలని నా భావం. ముఖ్యంగా తెలుగు సారస్వతంలో కవీ, విమర్శకుడూ ఒకే వ్యక్తిగా ఉంటున్నారు. ఈ రెండు పనులూ ఒకే వ్యక్తి చేయడం వల్ల ఇటు కవిత్వమూ వికసించడం లేదు. అటు విమర్శా రాణించడం లేదు.

కవి అయినవాడు విమర్శ చేస్తే సర్వదా తన కవితా ప్రతిభనే పై నుంచుకొని తక్కినవారి కృషిని తక్కువ చేసి విమర్శిస్తాడు. విమర్శకుడు కవి అయితే తక్కిన కవుల కావ్యాలకు న్యాయం చెయ్యలేడు. కవులు విమర్శ విమర్శకులు కవిత చెప్పడం ఉంది. అయితే అది కేవలం తాత్కాలికమూ, సరదా కోసమూ అయినప్పుడే వాటికి ఆశించిన ఫలితం దక్కుతుంది.

గతంలో దివాకర్ల వెంకటావధాని వంటి విమర్శకులూ, వక్తలూ వుండేవాళ్ళు. ఆయనకు ఇతర ఆసక్తులు ఉండేవి కావు. అందుకే ఆయన విమర్శకూ, వ్యాఖ్యానాలకూ, పరిశోధనలకూ, వక్తృత్వానికీ అంత ప్రాచుర్యం ఏర్పడింది.

ఆయన తర్వాత ఎవరు ?

నారాయణ రెడ్డి గారు (సినారె) గొప్ప వక్తగా ప్రసిద్ధుడైనాడు. సాహిత్యంలో గొప్ప వక్తగా, వక్తృత్వంలో చమత్కారం జోడించి ఏ సభలోనైనా ఆయన ప్రసంగిస్తున్నప్పుడు ఓహో అనిపిస్తాడు. అయితే ఆయన ప్రధానంగా కవి.

మరొకరు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు. ఈయన ప్రధానంగా విమర్శకుడు. ప్రతిభా వ్యుత్పత్తులలో అగ్రగణ్యుడు. అవధాని గారి తర్వాత తెలుగు సారస్వతానికి దిక్కూ, దివాణమూ సుబ్రహ్మణ్యం గారే అని అనుకుంటూ ఉండేవాణ్ణి. ఆ మాట సుబ్రహ్మణ్యం గారి తోనే చెబుతూ ఉండేవాణ్ణి. ఆయన నవ్వేసి వూరుకునేవాడు.

ఉన్నదున్నట్టుగా, నిజం చెప్పడం నా అలవాటు. దాని వల్ల ఎన్నో నిష్ఠూరాలు చుట్టుముడుతై. ఎంతో మంది స్నేహితులు దూరమై పోతారు. నిజం ఉగాది నాటి వేపపువ్వు పచ్చడి లాంటిది. ఆరోగ్య కరమే కావచ్చు. కానీ చేదు కదా! బెల్లం ఎంత కలిపినా చేదు తగ్గదు.

నిజం చేదు. అయినా దానిని వడ్డిస్తూనే ఉంటాను నేను. ఫలితాలు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ లెక్క చెయ్యను. విశిష్టమైన ప్రత్యేక వ్యక్తిత్వం నాది. నాకు శత్రువులెవరూ లేరు. నా రచనలు కిట్టని మిత్రులున్నారు అట్టివారు కూడా శతృత్వం పాటించరు కానీ వ్యతిరేకత ప్రదర్శిస్తూ ఉంటారు. అందులోనూ ప్రసన్నతకు లోపం రానియ్యరు.

నన్ను బాగా అర్థం చేసుకొని, నా లోని నిజ నిష్ఠూరాలని సహించి నా పట్ల ప్రసన్నంగా ఉండే వ్యక్తులలో, పండితులలో సుబ్రహ్మణ్యం గారు ఒకరు. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం అనే పేరును జీవీయస్ గా కుదించారు వారి శిష్యులు.

జీవీయస్ షష్టిపూర్తి ఒక మహోత్సవంగా, ఒక సారస్వతోద్యమంగా జరిపారు. 1996 లో ఆ ఉత్సవాలు ఒక సంవత్సరం పాటు జరిపారు. ఆయన రచనలన్నీ వివిధ సంపుటాలుగా ముద్రించారు. రసజ్ఞులైన మిత్రులకు అంకితాలు ఇచ్చారు. సెప్టెంబరులో ఆయన జన్మోత్సవం జరిపి అనేకమంది కవి పండితులను ఆహ్వానించారు. సన్మానించారు.

అట్టి మహాసభలో సన్మానితులలోనే నొకణ్ణి.అ

జివియస్‌గారు ఆ ఉత్సవాల సందర్భంలో జివియస్ పీఠికలు అనే గ్రంథాన్ని నాకు అంకితమిచ్చారు. ఆయన వివిధ సందర్భాలలో చాలా కావ్యాలకూ, గ్రంథాలకూ వ్రాసిన పీఠికలను ఒక సంకలనంగా అచ్చువేసిన గ్రంథం ఇది. పీఠిక, ప్రస్తావన, ముందు మాట, ప్రవేశిక, ఉపోద్ఘాతం వంటి మాటలన్నీ ఇంట్రడక్షన్ అనే మాటకు పర్యాయపదాలు. ఇవన్నీ వ్రాశారు జివియస్‌గారు. ఆయన గొప్ప వ్యుత్పన్నుడు. మేధావి. ఉద్దండ పండితుడు.

ఉన్నతోన్నత మానవత్వం గల మహా మనిషి. విశిష్ట వ్యక్తిత్వం గల మహా వ్యక్తులలో ఈనాడు సుబ్రహ్మణ్యం గారు అగ్రగణ్యుడు. గతంలో అవధాని గారి లాగే వర్తమానంలో నా గ్రంథావిష్కరణ సభల్లో, సాహిత్య ఉత్సవాల్లో పాల్గొంటూ, గ్రంథ పరిచయాలు చేసే అత్యున్నత వ్యక్తి, అభ్యుదయ భావ సంపన్నుడు, అపార లోకజ్ఞతా వైభవ సముజ్వలుడు.

ఆనాటి సభ సారస్వత వైభవ వైజయంతిక. సభలో పాల్గొని అంకితాన్ని అందుకొని, పొగడ్తలు విని, ఆనందతో తన్మయుణ్ణై ఇంటికి చేరిన నేను అవే ఆలోచనలతో నిద్రకు ఉపక్రమించినప్పుడు నా ముందు ప్రత్యక్షమైన దృశ్యం ఈ కావ్యం. దీన్ని జరిగింది జరిగినట్టు దృశ్య కావ్యంగా ఆ రాత్రే వ్రావాను. సుబ్రహ్మణ్యం గారికే అంకితం చెయ్యాలన్న ఆలోచన వచ్చింది. ఆలోచన రూపు దిద్దుకోవడానికీ, గ్రంథం అచ్చు కావడానికీ, డబ్బుకూ అవినాభావ సంబంధం ఉంది. అది ఇంత కాలానికి ఫలప్రదమైంది. కాగా ఇప్పుడు దీనిని ప్రకటించి సహృదయుల ముందు ఉంచుతున్నాను.

దీనినిదృశ్య కావ్యంగా వ్రాశాను కదా! దీని ఇతివృత్తంలో కథ ఏమీ లేదు. కొద్దిపాటి విచిత్ర భావాలున్నై. అవి నా మనసు చేసిన కల్పనలు.

బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య అనేది శంకరాచార్యుడి సిద్ధాంతం. సత్యం నుంచి పుట్టేదంతా సత్యమే అవుతుంది కనుక జగత్తు కూడా సత్యమే అనేది నా సిద్ధాంతం. బ్రహ్మ శాశ్వ త సత్యం కనుక జగత్తు కూడా సత్యమే అనేది నా సిద్ధాంతం. బ్రహ్మ శాశ్వత సత్యం అయితే జగత్తు తాత్కాలిక సత్యం కావచ్చు. జగత్తు ఎంత తాత్కాలికమైనా, క్షణికమైన దైనా సత్యమే అవుతుంది కాని మిథ్య ఎలా అవుతుంది?

అయితే పరబ్రహ్మ ఒక శక్తి ( ఎనర్జీ) అయినప్పుడు, ఆ శక్తికి జాగృతి లేనప్పుడు అది ఉన్నా లేనట్టే కదా!

దేవుడు ఉన్నా డనుకుంటే ఉన్నాడు. లేడనుకుంటే లేడు అని నా చిన్నప్పుడు మా అయ్య చెప్పిన మాట నా కిప్పటికీ వేదవాక్యమే. దేవుణ్ని ధ్యానించడం వల్ల, ప్రార్థించడం వల్ల, కోరికలు కోరడం వల్ల ఫలితం కనిపించకపోవడానికి కారణం ఇదే. జన్యు స్వభావం మారదు. యథా జన్యు తథా ఫలం. జన్యు స్వభావాన్ని మార్చడానికి సైంటిస్టులు ప్రయత్నిస్తున్నారు. ఫలితం ఉంటుందనీ, అది ప్రజలకు ఉపయుక్తం అవుతుందనీ నే ననుకోవడం లేదు.

బ్రహ్మ మిథ్య అనేది ఈ కావ్యంలో బ్రహ్మ గారే చెప్పినట్లు చతుర్ముఖ బ్రహ్మను గురించినట్టిదే కావచ్చు.

ఎందుకంటే మనువు పంచమ వర్ణం లేదన్నట్లే, బ్రహ్మ యొక్క పంచమ ముఖాన్ని నరికి వేసినప్పుడే చాతుర్వర్ణ్య వ్యవస్థ నిర్వీర్యమైంది. అలాంటి చతుర్ముఖ బ్రహ్మను గానీ, ఆయన సృష్టిని గానీ మిథ్య అన్నప్పుడు అది నిజంగా మిథ్యే. ఇప్పుడు అది ఉండీ లేనట్టే కదా! చాతుర్వర్ణ్య వ్యవస్థ చాతుర్కుల వ్యవస్థగా మారి హైందవ సమాజమే అన్ని విధాలా శక్తి హీనమై ఉంది కదా!

అందుకే ఈ కావ్యంలో బ్రహ్మ యొక్క పంచమ ముఖాన్నే సత్యంగా ప్రకటించాను. దానికి సరస్వతితో అవినాభావం కల్పించాను. బ్రహ్మ చేస్తున్న నాలుగు ముఖాల, నాలుగు రకాల సృష్టినీ కాదన్నాను. ఏక ముఖంతో ఏక జాతి సృష్టికి గుర్తింపు ఇచ్చాను. వర్ణ కుల భేదాలు, వృత్తి భేదాలు, వయోలింగ భేదాలు లేని ఏక జాతీయతను, ఏకైక మానవతను ప్రాచుర్యం లోకి తెచ్చాను. పురుషాధిపత్యం నుంచి అధినేతృత్వాన్ని పౌరుష గుణానికి మార్చాను. పౌరుషం ఎవరిలో ఉన్నా వాళ్లు ఆధిపత్యానికి అర్హులే. బ్రహ్మ సృష్టికి కాలదోషం పట్టింది. సరస్వతి యొక్క పంచమ ముఖ సత్య సృష్టి ప్రారంభమైంది.

ఈ కావ్యాన్ని దీని రచనకు మూల కారణమైన జీవియస్ గారికే అంకిత మిస్తున్నాను. ఆయన పీఠికా సంకలన గ్రంథం నాకు అంకితమిస్తూ ఆయన ఇలా వ్రాశారు.

పాలేరు నుండి పద్మశ్రీ దాకా
ప్రస్థానం సాగించిన ప్రజానిధి
రాగ వైశాఖిలో రసాద్వైతాన్ని
సధించిన రాజ యోగి
ఉపనిషత్కాల సమ సమాజాన్ని
దర్శించిన కాలమేది
దీప సభలా కలకాలం
వెలుగొందే కావ్య శిల్పి
పద్మశ్రీ డా॥ బోయి భీమన్న గారికి
గౌరవ పురస్కారంగా అంకితం.

* * *